నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
3 | వరంగల్, ఆదివారం 4 మే 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, విప్, ఎమ్మెల్యేలు

# సర్కారుపై సమస్యల ఏకరువు

## అసంతృప్తి వెల్లగక్కిన సొంత పార్టీ ఎమ్మెల్యేలు

- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేవని ఆగ్రహం
- గన్నీ సంచులు, టార్పాలిన్లు, లారీలు అందుబాటులో ఉండడం లేదు
- సమీక్ష సమావేశంలో రైతుల ఇబ్బందులను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

హనుమకొండ, మే 3 : కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే తమ అసంతృప్తిని వెల్లగక్కారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సాగునీటి పారుదల, పౌర సరఫరా శాఖలపై సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రాంచంద్రునాయక్, గండ్ర సత్యనారాయణతో పాటు ఇతర ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు సక్రమంగా లేవని ఏకరువు పెట్టారు. ముఖ్యంగా వడ్లు కాంటాలు అయిన తర్వాత కేంద్రాల్లో ఉంటున్నాయని, తూకం వేసినప్పటి నుంచి మిల్లులకు చేరే వరకు చాలా సమయం పడుతున్నదన్నారు. చాలా చోట్ల గన్నీ సంచులు, టార్పాలిన్స్, లారీలు అందుబాటులో ఉండటం లేదన్నారు. పొద్దంతా ఎండకొట్టి సాయంత్రం కాగానే అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం తడిసిపోయి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రవాణా చేసేందుకు లారీలు సరిగా రావడం లేదన్నారు. సన్నధాన్యానికి సంబంధించి బోనస్ ఇవ్వడం లేదని, కాంటా పెట్టి 15 రోజులైనా ధాన్యం తరలించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యేలు వివరించారు. అంతేగాక గన్నీ సంచుల విషయంలో పర్యవేక్షణ సక్రమంగా లేదని, కొనుగోలు చేసిన తర్వాత వడ్లు తరలించకపోవడంతో వర్షాలు పడి నీళ్లలో కొట్టుకపోతున్నాయని, ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో మిల్లుల కేటాయింపు జరుగలేదని విషయాన్ని కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని ఎమ్మెల్యేలు.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యం ఎప్పటికప్పుడు తరలించేలా, సరిపడా గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా, రైతులకు ధాన్యం డబ్బులు త్వరగా ఖాతాల్లో జమ చేసేలా అధికారులను ఆదేశించాలని వారు కోరారు.

### ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు

ఇరిగేషన్ శాఖ అధికారుల పనితీరును అధికార పార్టీ ఎమ్మెల్యేలు తప్పుపట్టారు. సమస్యలున్నాయని ఎస్ఈ, డీఈ, ఏఈలకు చెప్పినా పట్టించుకోవడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు ఇన్ ఆక్టీవ్‌గా ఉంటున్నారని ప్రభుత్వం విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మంత్రికి వివరించారు. వారి వద్ద పూర్తిస్థాయి సమాచారం ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు పనితీరు మెరుగుపరుచుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

## రెండేళ్లలో దేవాదుల పూర్తిచేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించి రెండేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రెండున్నర లక్షల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. వరంగల్ జిల్లాలో సాగునీటి పారుదల శాఖ అభివృద్ధి పనుల పురోగతి, పౌర సరఫరాల శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో వడ్లు పండించామని మంత్రి తెలిపారు. దొడ్డు రకం ధాన్యానికి మద్దతు ధర, సన్నధాన్యానికి మద్దతు ధర, రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రెండు సీజన్లలో తెలంగాణలో పండినంత ధాన్యం ఉమ్మడి రాష్ట్రంలో పండలేదన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, ఈ ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు.

## అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

**- ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి**

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాల్లోని సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో గిరిజన గ్రామాలు, వాగులు ఉన్నందున చెక్‌డ్యామ్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సాగునీటి కాల్వల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, అద్వైత్‌కుమార్ సింగ్, దివాకర టీఎస్, రిజ్వాన్ బాషా షేక్, రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు, సాగునీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

### భద్రకాళి చెరువు పూడికతీత పనులు త్వరగా పూర్తికావాలి

వరంగల్, మే 3 : భద్రకాళీ చెరువు పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ఆదేశించారు. శనివారం చెరువు పనులను వారు పరిశీలించి ఇప్పటివరకు తీసిన పూడికతీత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే జూన్ 15 నాటికి పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు.

## దేవాదుల పనులను వెంటనే పూర్తి చేయాలి : ఎమ్మెల్యే పల్లా


మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి


జనగామ నియోజకవర్గంలో నిలిచిపోయిన దేవాదుల పనులను వెంటనే పూర్తి చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. దేవాదుల ప్రాజెక్టు కెనాల్ పనులు నిలిచిపోయాయని, నిధులు కేటాయించి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో పల్లా మాట్లాడారు. ధర్మసాగర్ నుంచి గండిరామారం వరకు నీరు తరలించే 4 మోటార్ల గురించి వివరించారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి వద్ద ఆగిపోయిన కాల్వ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. తపాస్‌పల్లికి మల్లన్నసాగర్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకొచ్చే పనులు 25శాతం పూర్తయ్యాయని ఇవి పూర్తయితే ధర్మసాగర్ నుంచి గండిరామారం మీదుగా తపాస్‌పల్లికి సులువుగా నీరు చేరుతుందని, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ప్రాంతాలకు ఎక్కువ నీరు వస్తుందని చెప్పారు. భూసేకరణ పరిహారం కొందరికే ఇవ్వవడం వల్ల బచ్చన్నపేట, చేర్యాల ప్రాంతాల్లో కెనాల్ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయని వెంటనే నిధులు కేటాయించి పనులు పునఃప్రారంభించాలని కోరారు. ఆర్ఎస్ ఘన్‌పూర్ నుంచి అశ్వరావుపల్లి మీదుగా చీటకోడూరు వరకు 12 కిలోమీటర్లు గ్రావిటీతో నీరు తీసుకురావడం జరుగుతున్నదని, చీటకోడూరు డ్యామ్‌లో నిల్వ చేసి, అక్కడినుంచి జనగామ పట్టణానికి తాగునీరు సరఫరా చేస్తారని డ్యామ్‌లో నీరు నింపి జనగామ పట్టణానికి నిరంతర తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తరిగొప్పుల, చిలుపూర్, వేలేరు మండలాలకు సంబంధించిన లిఫ్ట్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో మూడు లిఫ్ట్‌లకు సంబంధించి రూ.104 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఒక లిఫ్ట్ ద్వారా తరిగొప్పుల మండలంలోని 15 గ్రామాలకు నీరందించే పనులను పరిశీలించాలని మంత్రిని కోరారు. వానకాలంలో ఈ ప్రాంతంలో సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేవాదుల పంపింగ్ మెయింటెనెన్సు డబ్బులు ఆలస్యంగా ఇవ్వడం వల్ల గత సీజన్‌లో 34 రోజులు మోటార్లు ఆపివేయడం దురదృష్టకరమని, ఇక నుంచి ఇలాంటివి జరగకుండా మెయింటెనెన్స్ పనుల బిల్లుల చెల్లింపు ప్రక్రియను గ్రీన్‌ఛానెల్‌లో పెట్టి వేగంగా పూర్తి చేయాలని కోరారు.

## కర్రెగుట్టల్లో ఇద్దరు జవాన్లకు అస్వస్థత

వెంకటాపురం(నూగూరు), మే 3 : కర్రెగుట్టల్లో పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్టుల అగ్రనేతలు సహా సుమారు వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో కేంద్ర బలగాలు 14 రోజులుగా కూంబింగ్ చేస్తున్నాయి. కాగా, ఇద్దరు జవాన్లకు వడదెబ్బ తగలగా వారికి వెంకటాపురం వైద్యశాలలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు సమాచారం.


వెంకటాపురం(నూగూరు): చెలిమె నీటిని తోడి బిందెల్లో పోసుకుంటున్న గిరిజనులు

### చెలిమె నీరే దిక్కు..



వెంకటాపురం(నూగూరు) : తాగునీటి కోసం గిరిజన గ్రామాల ప్రజలు తండ్లాడుతున్నారు. చెలిమె నీరే వీరికి దిక్కైంది. ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీ పర్శికగూడెం, రామవరం గ్రామాల ప్రజలు చెలిమ నీటినే తాగునీరుగా వాడుకుంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు, బావులు వట్టిపోయాయని, మిషన్ భగిరథ నీరు కూడా అరకొరగా రావడంతో ప్రజలు తాగునీళ్ల కోసం ఇబ్బందిపడుతున్నారు. చేసేదేమీ లేక గ్రామ శివారులోని చెరువు వద్ద చెలిమ తీసుకొని ఆ నీటినే తాగునీరుగా వాడుకుంటున్నారు. చెలిమ నీరు తెచ్చుకునేందుకు ఉదయం నుంచే పడిగాపులుకాయాల్సి వస్తున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.


గేట్‌వాల్వ్ లీక్‌తో కాటారం మండలం ధన్వాడ పత్తిమిల్లు సమీపంలో వృథాగా పోతున్న భగీరథ నీరు

## ఫౌంటెన్ కాదు.. లీకేజీ

### గేట్‌వాల్వ్ లీకై ఎగిసిపడుతున్న భగీరథ నీరు

కాటారం, మే 3 : ఇదేదో వాటర్ ఫౌంటేయిన్ కాదు.. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ. భగీరథ పైపులైన్ గేట్‌వాల్వ్ ఎయిర్ పట్టుకొని నీరు సక్రమంగా రాకపోవడంతో అధికారులు మెయిన్ గేట్‌వాల్వ్‌ను లీక్ చేశారు. దీంతో కాటారం మండలం ధన్వాడ పత్తిమిల్లు సమీపంలో శనివారం నీరంతా ఫౌంటేయిన్‌లా ఎగిసిపడి వృథాగా పోయింది. ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది.

# మళ్లీ మొదలైన తాగునీటి గోస

## తండ్లాడుతున్న పల్లెలు, పట్టణాలు

**మిషన్ భగీరథ పథకంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినా, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మళ్లీ పాత రోజులు పునరావృతమవుతున్నాయి. ఎండాకాలం కావడంతో తాగునీటి కోసం పల్లెలు, పట్టణాలు గోస పడుతున్నాయి. తాగునీళ్ల కోసం బిందెలతో మహిళలు రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చింది.**

**- మహబూబాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ)**

- మిషన్ భగీరథ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ప్రైవేటుగా కొనుక్కుంటున్నా పట్టించుకోని అధికారులు
- నాలుగు రోజులకోసారి నీళ్లొస్తున్నాయని ప్రజల ఆవేదన

గత పదేళ్లలో ఎన్నడూ రాని తాగునీటి గోస మళ్లీ మొదలైంది. రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఎండాకాలం వచ్చిందంటే మహిళలు తాగునీళ్ల కోసం బిందెలతో రోడ్డెక్కాల్సి వచ్చేది. కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తెచ్చుకునేవారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధి చేసిన జలాలను ఎండాకాలంలో కూడా ప్రతిరోజూ అందించింది. దీంతో గత పదేళ్లలో తాగునీళ్ల కోసం మహిళలు రోడ్డెక్కలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే మళ్లీ నాటి రోజులు పునరావృతమవుతున్నాయి. మిషన్ భగీరథ పథకంపై ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తాగునీటి కోసం పల్లెలు, పట్టణాలు తండ్లాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో భగీరథ నీళ్లు ప్రతి రోజూ వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదట రోజు తప్పించి రోజు, తర్వాత రెండు రోజులకోసారి, ఇప్పుడు నాలుగు రోజులకోసారి నీళ్లు ఇస్తున్నారు. కొన్ని గ్రామాలు, తండాల్లో నీళ్లు అసలే రావడం లేదు. ప్రైవేటు వాటర్‌ప్లాంట్లలో క్యాను రూ.10ల వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. మహబూబాబాద్ పట్టణంలో నందనాగర్, జగ్జీవన్‌రావు కాలనీ, హౌసింగ్ బోర్డ్, హనుమంతునిగడ్డ, లెనిన్‌నగర్, సిగ్నల్ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, గాంధీపురం, ముత్యాలమ్మగూడెం కాలనీలో తాగునీరు రాక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గూడూరు మండలం గుండెంగ సమీపంలోని నాలుగైదు తండాలకు వారం రోజులుగా తాగునీరు రావడం లేదు. తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో నాలుగు రోజులకోసారి మిషన్ భగీరథ నీరు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. దంతాలపల్లి మండలం బాల్యతండా శివారు సింగితండాకు ఇప్పటివరకు భగీరథ నీరు రాకపోవడంతో అక్కడి ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మహబూబాబాద్ పట్టణంలో మిషన్ భగీరథ నీళ్లు రెండు మూడు రోజులకోకసారి వస్తుండడంతో మున్నేరు వాగు నుంచి నీటిని డంపు చేసి ఫిల్టర్ చేసి పట్టణ ప్రజలకు అందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తాగునీటి వసతి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.


జనగామ రూరల్: గానుగుపహాడ్‌లో వారం నుంచి తాగునీరు రాకపోవడంతో సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు


గూడూరు: గుండెంగలో భగీరథ నీరు రాకపోవడంతో బోరింగ్ నుంచి నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు


వెంకటాపురం(నూగూరు): చెలిమె నీటిని తోడుకొని గూడేలకు మోసుకొని వెళ్తున్న గిరిజనులు

# కాంగ్రెసోళ్లకేనా ఇందిరమ్మ ఇండ్లు?

- గ్రామాల్లో ఎక్కడికక్కడ అధికారుల నిలదీత
- ఆగిపోతున్న ఇందిరమ్మ ఇండ్ల విచారణ
- ప్రజలకు సమాధానం చెప్పలేక వెనుదిరుగుతున్న అధికారులు
- అణగారిన వర్గాలకు అన్యాయం


వెంకటాపురం గ్రామంలో అధికారులను నిలదీస్తున్న కొండ రాంనర్సమ్మ

**ఇందిరమ్మ ఇండ్ల కోసం** లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గందరగోళంగా మారింది. అర్హులకు కాకుండా ఇందిరమ్మ కమిటీలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు, వారి అనుయాయులకే ఇండ్లు కేటాయిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకుండా పూరిగుడిసెల్లో బతుకుతున్న వారిని కూడా విస్మరిస్తుండడంతో సర్వేకు వచ్చిన అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. దీంతో వారికి సమాధానం చెప్పలేక వెనుదిరుగుతున్నారు. ఇప్పటివరకు ఏ గ్రామంలో కూడా సర్వే ప్రక్రియ పూర్తికాలేదు. **-తొర్రూరు, మే 3**

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని అధికారుల నిలదీతలు, నిరసనలతో పల్లెలు అట్టుడుకుతున్నాయి. నిజమైన లబ్ధిదారులకు కాకుండా, ఆస్తిపాస్తులున్న వారు, కాంగ్రెస్ అనుయాయులకే ఇండ్లు కేటాయించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొర్రూరు మండలానికి 538 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. ఇందులో అమ్మాపురానికి 56, జీకే తండాకు 8, హచ్చుతండాకు 12, గుర్తూరుకు 27, జమస్థానపురానకి 6, కంఠాయపాలానికి 33, చింతలపల్లికి 12, కొమ్మనపల్లితండాకు 10, వెలికట్టె గ్రామానికి 24, బోజ్యాతండాకు 6, ఈదులకుంట తండాకు 4, పెద్ద మాంగ్యతండాకు 10, నాంచారిమడూరుకు 26, గుడిబండ తండాకు 10, మడిపల్లికి 17, వెంకటాపురానికి 19, అమర్‌సింగ్ తండాకు 18, దుబ్బతండాకు 8, హరిపిరాలకు 33, కర్కాలకు 11, చర్లపాలానికి 30, గోపాలగిరికి 17, చికటయపాలానికి 21, ఫతేపురానికి 25, పోలపల్లికి 16, మాటేడుకు 30 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. అయితే, వీటిని నిబంధనల ప్రకారం అర్హులైన పేదలకు కాకుండా, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకే కేటాయించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామస్థాయి విచారణ కూడా పూర్తికాకుండానే ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 30న ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల విచారణ ప్రక్రియ ఇప్పటి వరకు ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తి కాలేదు. మొదటగా వెంకటాపురంలో ప్రారంభమైన విచారణ గొడవలతో నిలిచిపోయింది. కంఠాయపాలెం, హరిపిరాల, వెలికట్టె వంటి గ్రామాల్లో ఇప్పటికే విచారణ ప్రక్రియ ఆగిపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎక్కడైనా అవకతవకలు జరిగితే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. తొర్రూరు మండలంలో అర్హులకు జరిగిన అన్యాయంపై అధికార పార్టీ ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మౌనంగా ఉండడంతో ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇండ్లు రాజకీయాలకతీతంగా నిజమైన లబ్ధిదారులకే కేటాయించాలని డిమాండ్ చేస్తునారు.

### ప్రజల నిలదీతలు.. వెనుదిరుగుతున్న అధికారులు

వెంకటాపురం గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల విచారణ కోసం వచ్చిన అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వారికి ఎలాంటి సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కొండ రాంనర్సమ్మ మాట్లాడుతూ.. మొదట అధికారులు తమ ఇంటికి విచారణ కోసం వచ్చినా, కొందరు కాంగ్రెస్ నాయకులు అధికారులపై దౌర్జన్యం ప్రదర్శించి తన పేరును తొలగించారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, తన కొడుకు బీజేపీలో తిరుగుతున్నాడని పేరును తొలగించారని తెలిపింది.

### ఆర్డీవోకు వినతి

కంఠాయపాలెం గ్రామానికి 40 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై శనివారం అఖిలపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీవో గణేశ్, ఎంపీడీవో పూర్ణచేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో గణేశ్ మాట్లాడుతూ.. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఆస్తులున్న వారిని వెరిఫికేషన్ ప్రక్రియలో తొలగిస్తామని, లబ్ధిదారుల జాబితాను గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలుంటే పరిశీలించి అర్హత లేని వారిని జాబితా నుంచి తొలగిస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీలు కూడా అర్హతలేని వ్యక్తులను వెరిఫికేషన్ సమయంలో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాయని హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ ఇండ్ల లొల్లి

### పోటాపోటీగా ఎంపీడీవోకు వినతి పత్రాలు

నర్సింహులపేట : ఇందిరమ్మ ఇండ్ల లొల్లి రచ్చకెక్కుతున్నది. 'జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని ఒక వర్గం.., మేం అర్హులం.. మాకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఇందిరమ్మ కమిటీ నిర్ణయించింది.. మాకు ఇల్లు మంజూరు చేయాలి' అని పోటాపోటీగా ఎంపీడీవో యాకయ్యకు పెద్దనాగారం గ్రామస్తులు వినతి పత్రాలు అందజేశారు. శుక్రవారం గ్రామానికి చెందిన కొంత మంది తమకు ఇండ్లు మంజూరు చేయాలని ధర్నా చేసి ఎంపీడీవోకు వినతిపత్రం అందించగా, శనివారం మరికొంత మంది తమకు ఇండ్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కాగా, గ్రామంలోని కొందరు నాయకులు తెరవెనుక ఉండి లబ్ధిదారులతో ఇలా వినతి పత్రాలు ఇప్పించడంతోపాటు ధర్నా చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇల్లు ఎంపికకు సంబంధించి గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో జరిగిన సమావేశానికి ఒక వర్గాన్ని పిలువలేదని బూతులు తిట్టుకున్నట్లు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న పెద్దనాగారం గ్రామస్తులు